




# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 15-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 194 పేజీలు: 4 వెల : రూ.7


## క్రైం కార్నర్



### 22 కిలోల గంజాయి స్వాధీనం

**మెళియాపుట్టి, డిసెంబర్ 14 (వార్త):** ఒడిశా నుంచి 22 కిలోల గంజాయిని ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా పట్టుకున్నామని సీఐ సీఐ రామారావు, ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా స్థానిక మహేంద్రతనయనది వద్ద ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారి వద్ద ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా 22 కిలోల గంజాయి బయటపడిందన్నారు. వీరిద్దరూ గజపతి జిల్లా అడవురు గ్రామానికి చెందిన జోషఫ్‌బీర్, విశాఖపట్నం చెందిన అఫ్రోజ్ అలంగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. ఈ గంజాయిని సీజ్ చేశామని, వారిని కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

### బైక్ ఢీకొని యువకుడు మృతి

**కంచిలి, డిసెంబర్ 14 (వార్త):** కంచిలి మండలంలోని సూదిపుట్టుగ గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన రమేష్ బెహరా(25) మృతి చెందాడు. రమేష్ తలతంపర గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి కాలినడకన వస్తున్నాడు. కవిటి మండలం బెజ్జిపుట్టుగకు చెందిన బొరివంక వీఆర్వో గుర్రాల దివాకర్ బైక్‌పై వేగంగా వస్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు ఐదు నెలల క్రితమే వివాహమైంది. భార్య శ్యంతి బెహరా ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. భర్త మృతి విషయం తెలిసి కన్నీరుమున్నీరుగా విలపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి.పారి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కోటిపల్లిలో నాలుగు పూరిళ్లు దగ్ధం



**పొందూరు, డిసెంబర్ 14 (వార్త):** కోటిపల్లి గ్రామంలో శనివారం జరిగిన ప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధం కాగా, మరో ఇంటికి పాక్షికంగా నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పల్ల అసిరినాయుడు, పల్ల సన్యాసమ్మ, పల్ల మంగమ్మ, పల్ల లక్ష్మి, పల్ల వెంకటమ్మలు శనివారం పొలం పనులకు వెళ్లిపోయారు. సన్యాసమ్మ ఇంట్లో గ్యాస్ లీకై దేవుడి పూజా గదిలోనికి దీపానికి తాకడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న మంగమ్మ ఇంట్లోకి మంటలు వ్యాపించాయి. అందులో గ్యాస్ సిలిండర్ ఉండిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పొందూరు అగ్నిమాపక సిబ్బంది సిలిండర్‌ను బయటకు తీసి మంటలను నిలువరించారు. అప్పటికే ఇళ్లన్నీ దగ్ధమయ్యాయి. బంగారం, డబ్బు, ఆధార్ కార్డులు, పట్టాదారు పుస్తకాలు పూర్తిగా కాలిపోయాయి. బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### మూడు ఇసుక లారీల పట్టివేత

**మెళియాపుట్టి, డిసెంబర్ 14(వార్త):** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. గురువారం అర్ధరాత్రి సమయంలో తమకు వచ్చిన సమాచారాన్ని బట్టి మెళియాపుట్టి మండలం చిన్నహంస గ్రామం వద్ద ఈ లారీలను పట్టుకున్నామన్నారు. వారి దగ్గర ఇసుక తీసుకెళ్లేందుకు ఎటువంటి బిల్స్ లేకపోవడంతో ఈ లారీలను సీజ్ చేశామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం మైన్స్ డిపార్ట్‌మెంట్ వారికి రిఫర్ చేశామని తెలిపారు.



## ఆస్తి కోసం..

* నలుగురికి గాయాలు * టెక్కలి ఆసుపత్రిలో చికిత్స
* కేసు నమోదు చేసిన పోలీసులు

# అన్నదమ్ముల కొట్లాట

**టెక్కలి/శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 14 (వార్త):** భూ వివాదం.. అన్నదమ్ముల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటన టెక్కలి మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. టెక్కలి మండలం తిర్లంగి గ్రామానికి చెందిన పిట్ట జానకిరామయ్య, పిట్ట రామ్మోహన్‌లు అన్నదమ్ములు. తల్లికి చెందిన 50 సెంట్ల భూమి విషయమై కొంతకాలంగా వారి మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. కోర్టులో కేసు కూడా నడుస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తమ్ముడు రామ్మోహన్ ఆ వివాదాస్పద భూమిలో బోర్డును పాతాడు. విషయం తెలుసుకున్న అన్నయ్య జానకిరామయ్య తన కుమారుడు నవ్యక్రాంత్‌తో కలిసి శనివారం రామ్మోహన్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో తమ్ముడు లేకపోవడంతో అతని భార్య రాజేశ్వరితో గొడవకు దిగారు. వారి మధ్య వాగ్వాదం పెరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో రాజేశ్వరి, రామ్మోహన్‌తో పాటు జానకిరామయ్య, నవ్యక్రాంత్‌లు గాయపడ్డారు. గాయపడిన నలుగురు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టెక్కలి ఎస్ఐ రాము ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.









# ఏకపక్షమే!

* కొన్నిచోట్ల కూటమి అభ్యర్థుల మధ్య పోటీ
* 90 శాతం ఏకగ్రీవమే
* కొందరు ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే..
* ప్రశాంతంగా ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు
* 2606 టీసీలకు ఎన్నికలు
* 22 నీటి సంఘాలకు ఎన్నికలు వాయిదా

**శ్రీకాకుళం, డిసెంబర్ 14 (వార్త):** జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ఒకటి రెండు చోట్ల మినహా శనివారం ప్రశాంతంగా ముగిసింది. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో పాటు ముగ్గురు ఆర్డీవోలు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. వంశధార, జల వనరుల శాఖ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రక్రియను సజావుగా పూర్తి చేయగలిగారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత గెలుపొందిన సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షులకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జిల్లాలోని బీఆర్ఆర్ వంశధార, నారాయణపురం ఆనకట్ట, అలాగే మైనర్ ఇరిగేషన్ కింద మొత్తం 2628 నీటి సంఘాల ప్రాదేశిక స్థానాలకు గాను 2606 స్థానాలకు ప్రశాంతంగా ఎన్నికలు ముగిసాయి. పలు కారణాలతో ఇంకా 22 ప్రాదేశిక స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అలాగే 344 నీటి సంఘాలకు గాను రెండు మినహా మిగతా అన్నిచోట్ల ప్రశాంతంగా ఎన్నికల ఘట్టం ముగిసింది. ఈసారి ఎన్నికల్లో వైసీపీ దూరంగా ఉంది. కూటమి అభ్యర్థులే బరిలో దిగారు. అత్యధిక స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. పోలీసులు బందోబస్తు నిర్వహించడంతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. కొత్తూరు మండలంలోని అంగూరు గ్రామంలో కొత్తచెరువు, వెంకయ్య చెరువులకు సంబంధించి నీటి సంఘం ఎన్నిక శనివారం హైడ్రామా మధ్య ముగిసింది. సాయంత్రం నాలుగున్నర గంటల వరకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించలేదు. చివరకు పోలీసుల సమక్షంలో వాన ఈశ్వరరావును చైర్మన్‌గా, జంక భుజంగరావును వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవడంతో సమస్య ముగిసింది.



జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త. కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

### శాశ్వత అన్నదానానికి లక్ష వితరణ

**అరసవల్లి, డిసెంబర్ 14 (వార్త):**సోంపేట గ్రామ వాస్తవ్యులు సాన సుశీల, పకీర్ తర పున పొట్నూరు శ్రీనివాసరావు శనివారం అరసవల్లి సూర్య నారాయణస్వామి శాశ్వత అన్నదానం పథకం నిమిత్తం రూ.1,11,111లను ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఎ.శ్రీనివాసరావుకు అందజేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పైడిభీమవరం పారిశ్రామికవాడను తీర్చిదిద్దుతా


**-మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**శ్రీకాకుళం, డిసెంబర్ 14(వార్త):** రాష్ట్రంలో పారిశ్రామికరంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పైడి భీమవరంలోని డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్‌లో ఎచ్చెర్ల, రణస్థలం, పూసపాటిరేగ, భోగాపురం మండలాలలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

పారిశ్రామికవేత్తలు ఎదు ర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశామని, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. పైడి భీమవరం పారిశ్రామిక వాడలో మంచినీటి లభ్యతపై ఆందోళన వ్యక్తమవుతోందని, తారకరామ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ఆ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వ్యర్థజలాల నిర్వహణ కోసం చిన్న పరిశ్రమలన్నీ కలిసి ముందుకు వస్తే కేంద్రం ఇచ్చే 70 శాతం గ్రాంట్ తో ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నెలకొల్పవచ్చన్నారు. వ్యర్థ జలాలను శుద్ధ జలాలుగా మార్చి స్థానిక అవసరాలకు వినియోగించుకోవచ్చని, ఆ దశగా పరిశ్రమలు ప్రయత్నించాలని కోరారు. యువతలో నైపుణ్య అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని, పైడి భీమవరం పారిశ్రామిక వాడలో ప్రస్తుతం 30 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా ఆ సంఖ్యని 50 వేలకు పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు.

శ్రీకాకుళం ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అండ్ సేఫ్టీ కౌన్సిల్ (సిస్కో) పూర్తిస్థాయిలో పనిచేసేలా ఆదేశించామన్నారు. పారిశ్రామికవాడలో కాలుష్య నియంత్రణ కోసం కఠినమైన ఆంక్షలను విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, లోకం మాధవి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



### దూసి నీటి సంఘం చైర్మన్‌గా బాలకృష్ణ

**ఆమదాలవలస, డిసెంబర్ 14 (వార్త):** ఆమదాలవలస మండలంలోని దూసి భారీ నీటిపారుదల సంఘం ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. చైర్మన్‌గా హనుమంతు బాలకృష్ణ, వైస్ చైర్మన్‌గా గురుగుబిల్లి రాజశేఖర్ బాబు ఎన్నికయ్యారు. అలాగే ప్రాదేశిక కార్యవర్గ సభ్యులుగా బండ రమణమూర్తి, ముద్దాడ గవరయ్య, కంచరాపు ముకుందరావు, ఊట సూర్యం, పంచాది గోపి, చింతాడ బలరాం, కలివరపు చిన్న గురువులు, కూన శ్రీదేవి, పైడి నరసింగరావు హనుమంతు నారాయణమూర్తిలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏవీ విజయలక్ష్మి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అక్కివరం సర్పంచ్ ప్రతినిధి గురుగుబిల్లి నీలారావు, నాయకులు తాండ్ర హరి, మూల రాము, పొన్నాడ గణపతి, బెండి రాము, సనపల రుషి తదితరులు పాల్గొన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లను సభ్యులతో పాటు నాయకులు ఘనంగా సన్మానించారు.

### గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భాస్కర్ ప్రమాణం



**మెళియాపుట్టి, డిసెంబర్ 14(వార్త):** రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భాస్కర్ గౌడ్ శనివారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారి. ఆయనను మెళియాపుట్టి టీడీపీ యువత అధ్యక్షుడు బస్వ పరమేశ్వర్ రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఉర్లన వసంత్, యూనిట్ ఇన్‌చార్జి మండల ఎల్లంనాయుడు, శ్రీనివాస్, శశి, మధు, దిలీప్‌కుమార్ నాయక్, సంతోష్‌కుమార్ నాయక్ తదితరులు ఘనంగా సన్మానించారు.

## మహిళా సంఘాల ప్రగతికి పది సూత్రాలు

**-వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు**

**మందస, డిసెంబర్ 14(వార్త):** స్వయంశక్తి మహిళా సంఘాల ప్రగతికి పది సూత్రాలు తప్పక పాటించాలని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. మందసలో శనివారం జరిగిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంఘం క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారమే మీటింగులు నిర్వహించాలన్నారు. సమావేశానికి ఉద్దేశపూర్వకంగానే హాజరుకాని సభ్యురాలిని సంఘంలో కొనసాగనివ్వరాదని తెలిపారు. పొదుపులు, అప్పుల వసూలు పారదర్శకంగా జరగాలన్నారు. సంఘం వారీ లెక్కలు వివరంగా అందరికీ అర్థమయ్యేట్టు సంగ్రహ పట్టికలో పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. అప్పు కట్టని ఏ సభ్యురాలికి కూడా సంఘం ఆమోదం లేకుండా మళ్లీ అప్పు మంజూరు చేయకూడదన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగుసిబ్బంది పాల్గొన్నారు.



## మరణించినా.. ఆమె సజీవమే..!

**-ఉపాధ్యాయురాలు విజయ్ కుమారి దాతృత్వం**

**-రిమ్స్‌కు శరీరదానం**

**శ్రీకాకుళం, డిసెంబర్ 14(వార్త):** వైద్య విద్యార్థుల ప్రయోగాలకు తన పార్థివదేహాన్ని ఆరంగి విజయకుమారి (58)అనే ఉపాధ్యాయురాలు దానం చేసి..మరణాంతరం కూడా జీవించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆమె చికిత్స పొందుతూ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె కుమారుడు తన తల్లి పార్థివదేహాన్ని రిమ్స్ వైద్య కళాశాల అనాటమీ విభాగానికి అందజేశారు. ఆమె తీసుకున్న ఈ నిర్ణయం వైద్య విద్యార్థులకు ఉపయోగపడడమే కాకుండా, ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.సి.రవి వెంకటాచలం, డాక్టర్ కేవీ రాంప్రసాద్, డాక్టర్ ఎం. హేమరాధిక, డాక్టర్ తరణి, అధ్యాపకులు, సిబ్బంది.. విజయకుమారి కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



### ఒకే రోజున రెండు ఉద్యోగాలకు ఎంపిక

**భామిని, డిసెంబర్14(వార్త):** ఘనసరకి చెందిన చౌదరి సిసింద్రీ ఒకే రోజున రెండు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ పోస్టులకు ఎంపిక కావడం ఆయన ప్రతిభకు నిదర్శనమని గ్రామస్థులు కొనియాడారు. బీఎస్సీ పూర్తిచేసిన తర్వాత రాత పరీక్షల్లో సాధించిన అత్యుత్తమ మార్కులు, ఫిజికల్ టెస్టులో కనబరిచిన నైపుణ్యంతో రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడని తండ్రి జగన్నాథం, తల్లి రవణమ్మ ఆనందం వ్యక్తం చేశారు.



### వే బ్రిడ్జిని ప్రారంభించిన మాజీ ఎంపీపీ బొత్స

**వంగర, డిసెంబర్ 14(వార్త):**వంగర పెట్రోల్ బంకులో నూతనంగా నిర్మించిన వేబ్రిడ్జిని మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావునాయుడు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బంకు యజమానులు బలగ పోలినాయుడు, నారాయణరావు, చక్రి తదితరులు పాల్గొన్నారు.




## తూర్పు కాపు యువత విద్యపై దృష్టి పెట్టాలి



**శ్రీకాకుళం, డిసెంబర్ 14(వార్త):** తూర్పుకాపు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం చొరవ తీసుకోవాలని ఆ సామాజిక వర్గీయులు కోరారు. శనివారం శ్రీకాకుళంలో తూర్పుకాపు ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సురంగి మోహనరావు పిలుపు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాబ్‌మేళాలు నిర్వహిస్తూ,అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువత విద్యారంగంపై దృష్టి పెట్టాలని కోరారు. సంఘం బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.

తూర్పుకాపు అధ్య యన వేదిక అధ్యక్షుడు శాసపు జోగినాయుడు మాట్లాడుతూ సామాజికవర్గం అంతా కలిసికట్టుగా ఉండాలని, ఆనాడే హక్కుల సాధన సాధ్యపడుతుందన్నారు.అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభా పాటవాలు చూపిన ముగ్గురు తూర్పు కాపు ఉద్యోగులను సత్కరించారు. సత్కారం అందుకున్న వారిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సంఘం నేత కరణం చిన్న వెంకటరమణ, మక్కా శ్రీనివాసరావు, దాసరి రామచంద్రరావు ఉన్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సివ్వాల చంద్రశేఖర్, బాడాన చిన్నారావు కలిసి తూర్పుకాపు సామాజికవర్గం భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు డాక్టర్ ఎం.రామజోగినాయుడు, పడాల తమ్మునాయుడు, అంకడాల తవిటన్న, కిల్లారి నారాయణరావు, వాల్తేటి సత్యనారాయణ,వాళ్ల శ్రీరాములునాయుడు, కురిటి దుర్గారావు, పి.వసంతరావు, వాళ్ల సన్యాసినాయుడు, సురవరం పార్వతి, నడిమింటి అప్పలనాయుడు, పల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

## మండపల్లిలో సెమీ క్రిస్మస్



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 14(వార్త):** మండపల్లిలో ఆంధ్రా బాపిస్టు చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి కేక్ కట్ చేశారు. బెహరా ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్‌ని సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్తి విజయ్ కుమార్, వజ్రపు వెంకటేష్, మాచర్ల తాతాజీ పాల్గొన్నారు.




## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**బూర్జ, డిసెంబర్ 14(వార్త):** విద్యార్థులు ఆత్మ విశ్వాసం, నైపుణ్యాభివృద్ధి సాధిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. ఆన్‌ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు శనివారం ఆర్ట్స్ సంస్థలో ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యను అభ్యసించే విద్యార్థులు నైపుణ్యాల విషయంలో మరింత దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా తమ ప్రత్యేకతను చాటుతున్నాయని తెలిపారు. అనంతరం వ్యవసాయం, అనుబంధ పంటలు, చిన్నతరహా పరిశ్రమల స్థాపన, చిరుధాన్యాలు, అగ్రికెమ్, మార్కెటింగ్ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలపై సంస్థ ఎండీ నూక అనూప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో అధ్యాపకులు రాంప్రసాద్, రవి, ఆర్ట్స్ సంస్థ సిబ్బంది పెద్దపాటి బాలు, కురమాన సురేష్ పాల్గొన్నారు.

## విశాలాంధ్ర సంచార పుస్తకాలయం ప్రారంభం



**టెక్కలి, డిసెంబర్ 14(వార్త):** ప్రతిఒక్కరూ పుస్తక పఠనం నిరంతర ప్రక్రియగా అలవర్చుకోవాలని సీఐ అంబటి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన టెక్కలిలోని అంబేద్కర్ కూడలిలో విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదివే మిత్రులతోనే ఎక్కువగా స్నేహం చేయాలన్నారు. సామాజిక, సంస్కృత, తెలుగు, విశాలాంధ్ర సాహిత్యం, కమ్యూనిస్టు మార్క్సిజం, తెలుగు నవలలు, ఆధ్యాత్మిక, తెలుగు వ్యాకరణం, జనరల్ నాలెడ్జ్, విద్య తదితర రంగాలకు చెందిన పుస్తకాల అభ్యసనమనేది నిరంతర ప్రక్రియగా అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని వినియోగించుకొని, తమ మేథాశక్తిని పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల గోపి, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలసముద్రం సూర్యం, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

## దైవశక్తి వ్యవస్థాపకురాలు కృపాసముద్రం మృతి




**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 14 (వార్త):** నగరానికి చెందిన దైవశక్తి వ్యవస్థాపకులు జె.కృపా సముద్రం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె శ్రీకాకుళం జిల్లాలో 12 చర్చిలను స్థాపించారు. తెలుగురాష్ట్రాల్లో పెద్ద ఎత్తున క్రీస్తు సందేశాన్ని తన ప్రసంగాలు ద్వారా చేస్తుంటారు. అలాగే టీవీ, రేడియోల ద్వారా కూడా క్రీస్తు సందేశాన్ని ఇస్తుంటారు. ఆమె మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

## ఘనంగా ఉత్తరాంధ్ర భక్త సమ్మేళనం

**పలాస, డిసెంబర్ 14(వార్త):** ఉత్తరాంధ్ర రామకృష్ణ – వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పలాసలో శనివారం భక్త సమ్మేళనం ఘనంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న రామకృష్ణ మఠం, క్షేత్రాల నుంచి ప్రముఖ స్వామీజీలు విచ్చేసి ఉపన్యాసాలు, సత్సంగ కార్యక్రమాలు చేపట్టారు. గీత ఉపదేశ గ్రంథాలు, పుస్తక ప్రదర్శనలు నిర్వహించారు. రామకృష్ణ సేవా సమితి సభ్యులు, రామకృష్ణ సేవా సంఘాల భక్తులు సేవలందిస్తున్నారు. ఆంధ్ర – ఒడిశా సరిహద్దు గ్రామాలతో పాటు పరిసర ప్రాంత భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.




# లోక్ అదాలత్‌దే అంతిమ తీర్పు

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా**



**శ్రీకాకుళం, డిసెంబర్ 14(వార్త):** లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. శనివారం ఆయన జిల్లా న్యాయస్థానం ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 19 బెంచీలు నిర్వహించామన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు అదాలత్‌లో పరిష్కారమయ్యాయన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్స్ వారు, పారా లీగల్ వలంటీర్స్ ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు మార్గం సుగమమైందన్నారు. లోక్ అదాలత్‌ల్లో ఇచ్చినవి అంతిమ తీర్పులని స్పష్టం చేశారు. అనంతరం ఆయన కక్షిదారులకు ఆహారాన్ని అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్, సీనియర్ న్యాయవాది ఇందిరాప్రసాద్, వివిధ న్యాయస్థానాల న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

# రాజాంలో ఎమ్మెల్యే మురళి సుడిగాలి పర్యటన



**రాజాం, డిసెంబర్ 14(వార్త):** మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శనివారం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన జరిపారు. తొలుత ఆయన రాజాంలో ఆర్ఆర్ఆర్ జ్యూయలరీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. 15వ వార్డులో యందవ సూరిబాబు స్వగృహానికి వెళ్లి రమేష్– అనిత దంపతులను ఆశీర్వదించారు. ఇటీవల పాముకాటుకు గురైన యందవ శేఖర్‌ను పరామర్శించారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్యాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో నీటి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలిచిన రైతులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి వనరుల నిర్వహణ ముందుకు సాగక రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుతం ఈ సంఘాల ఎన్నికలు నిర్వహించారన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న కాలువలను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. రైతుల పక్షపాతిగా నిలబడ్డారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నేతలు గురవాన నారాయణరావు, కాటం శ్రీనివాసరావు, రవి, మరిపి జగన్మోహనరావు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ టీచర్లకు ఉద్యోగభద్రత కల్పించాలి



**మందస, డిసెంబర్ 14(వార్త):** గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ టీచర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రీకాకుళం గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం నాయకులు కోరారు. మందస మండలంలోని టంగరాపుట్టి పంచాయతీలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న 25 మంది ఉపాధ్యాయులను, పాడేరు ఐటీడీఏ పరిధిలోని వివిధ గురుకుల పాఠశాలలకు డిప్యూటేషన్ పద్ధతి వేయడం చాలా అన్యాయమన్నారు. దీనిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సవర నరసింహులు, గౌరవ అధ్యక్షుడు సవర సుధాకర్, కార్యదర్శి సవర జగ్గారావు, ఉప కార్యదర్శి యేసయ్య, ఉపాధ్యక్షుడు దాశరథి, లక్ష్మణరావు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం గెలిచింది..!

- అల్లు అర్జున్ బెయిల్ పై విడుదల కావడంతో ఫ్యాన్స్ హర్షం
- అరసవల్లిలో ప్రత్యేక పూజలు చేసిన బన్నీ అభిమానులు
- అన్యాయంగా అరెస్టు చేశారని మండిపాటు




**శ్రీకాకుళం, డిసెంబర్ 14(వార్త):** ఐకానిక్ స్టార్ అల్లు అర్జున్ మధ్యంతర బెయిల్‌పై విడుదల కావడంపై ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేశారు. న్యాయమే గెలిచిందని వారు శ్రీకాకుళంలో సంబరాలు జరిపారు. ఆలిండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుక్కల నవీన్ ఆ్వర్యంలో బన్నీ ఫ్యాన్స్ శనివారం అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు అన్యాయంగా అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారని వారంతా మండిపడ్డారు.

ఈ సంద ర్భంగా అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ కోట్లాది మంది అభిమానులు ప్రేమను సొంతం చేసు కున్న అల్లు అర్జున్‌కి ఆ భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నా రు. ఆ దేవుడు దయతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారన్నారు. కార్యక్రమంలో అల్లుఅర్జున్ ఫ్యాన్స్ గిరి, భాను, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం 15 డిసెంబర్ 2024

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి సర్కార్

**పలాస, డిసెంబర్ 14(వార్త):** కూటమి సర్కార్ అధికారం లోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించిందని వైసీపీ పలాస మండల అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. శనివారం ఆయన పలాస లో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతాంగానికి రైతు భరోసాను సకాలంలో చెల్లించేవారన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పంట కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్ని సేవలను ఇంటి ముంగిటనే అందించారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అన్నదాతకు పెట్టుబడి సాయం కూడా అందించడం లేదన్నారు.

# నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

**మందస, డిసెంబర్ 14(వార్త):** మందస మండలంలోని పలు నీటి సంఘాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అంబుగాం గేదెలనాయుడు చెరువుకు అధ్యక్షురాలిగా రెల్ల జానకమ్మ, ఉపాధ్యక్షునిగా మండల మాధవరావు, దేవుపురం దామోదరసాగరానికి గేదెల దుర్యోధన, బుడుకు విశ్వనాథం, మూలిపాడు పెద్దచెరువుకు కోనారి కాళిదాసు, యెలుమల పాపారావు, మందస గోపాలసాగరానికి బెహర తిరుపతి, పోలాకి భాస్కరరావు, మఖరజోల సంకుజోడు సిస్టంనకు గెడ్డవలస భీమారావు, గున్న ధనుంజయ, చీపిలోని చీపిగెడ్డకు సవర హీర, బెహర త్రినాథ్, కళింగదళ్ రైట్ మెయిన్ కెనాల్ (బుడారిసింగ్)కు హడియా కృష్ణచంద్ర, బిస్వల దాలిబందు ఎన్నికయ్యారు. కళింగదళ్ లెఫ్ట్ మెయిన్ (సిరిపురం) కెనాల్ కు బేసి భీమారావు, రామకృష్ణపాణిగ్రాహి, సునాముది సిస్టం-1(మందస)కు రట్టి లింగరాజు, కోనారి సింహాద్రి, సునాముది సిస్టం- 2 (కొత్తపల్లి)కు గుంట నారాయణ, సింగుపురం పాపారావు ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. నూతన కార్యవర్గాలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.





**మెళియాపుట్టి, డిసెంబర్ 14(వార్త):** మెళియాపుట్టి మండల పరిధిలో 17 నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భవానిశంకర్ తెలిపారు. మండల పరిధిలో 18 నీటి సంఘాలు ఉన్నప్పటికీ పెద్దలక్ష్మీపురంలో రైతులెవరూ రాకపోవడంతో ఎన్నిక జరగలేదన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



**వంగర, డిసెంబర్ 14(వార్త):** వంగర మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని అధికారులు తెలిపారు. మండలంలో 8 నీటి సంఘాల్లో కూటమి నాయకులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండచాకరపల్లి అధ్యక్షుడిగా వండాన సత్యంనాయుడు, అరసాడకు దొంతుల దుర్గారావు, కింజంగికి వేగిరెడ్డి కామేష్‌నాయుడు, శివ్వాంకు బి.అప్పలనాయుడు, తలగాంకు పైల శ్రీనివాసమూర్తి, రాజులుగుమ్మడకు ఎ.పార్థసారథి, అరసాడ-2కు టి.లక్ష్మణ్‌నాయుడు, ఇరువాడకు చౌదరి రాధను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 78 టీసీలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికలను టీడీపీ నేతలు బొత్స వాసుదేవరావునాయుడు, ఎం.గణపతి, ఉదయాన మురళీకృష్ణ, మోహన్, లచ్చుభుక్త కృష్ణమూర్తి తదితరులు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ షేక్‌శంకర్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



**శ్రీకాకుళం, డిసెంబర్ 14(వార్త):** శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికలలో 18 నీటి సంఘాలు ఏకగ్రీవం కావడంపై ఎమ్మెల్యే గొండు శంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఏకగ్రీవమైన నీటి సంఘాల చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఆయన అభినందించారు.

రైతులంతా కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచారని, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు రైతులకు మరింత సహాయ, సహకారాలు ప్రభుత్వం చేస్తుందన్నారు.

తెదేపా శ్రేణులు ఆనందంతో సంబరాలు జరిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికార యంత్రాం గం, రైతులు, కూటమి నాయకులను ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



**పాతపట్నం,డిసెంబర్ 14(వార్త):** నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో 76 సంఘాలను గెలుపొంది క్లీన్ స్వీప్ చేశామని పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యుడు మామిడి గోవిందరావు తెలిపారు.

శనివారం ఆయన గెలుపొందిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులను అభినందించారు. నీటి వినియోగ సంఘాలను బలోపేతం చేసి, చెరువులు, వాగు లు, గడ్డలను మరమ్మతులు చేయిస్తామన్నారు. రైతులు సకా లంలో పంటలు పండించేందుకు అణువుగా తీర్చిదిద్దుతామ న్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు ఉన్నారు.



**పోలాకి, డిసెంబర్ 14(వార్త):** పోలాకి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా మిరియపల్లి వెంకట అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోలాకి, మబగాం, ఈదులవలస యాట్లబసివలస సంఘాల ఎన్నికల్లో గెలు పొందిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు సభ్యులును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అభినందించారు. రైతు సమస్యలపై స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని వారికి సూచించారు.

**రాజాం, డిసెంబర్ 14(వార్త):** రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన తమ్మినాయుడు చెరువు, ఎర్ర చెరువుకి సంబంధించి శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైంది. శాసపు రమేష్‌కుమార్, గార గున్నంనాయుడు పాల్గొన్నారు. తిమ్మయ్యపూను ఆయకట్టు అధ్యక్షుడిగా ఉంగటి తవిటినాయుడు, కొత్తవలస అధ్యక్షుడిగా నాగళ్ల ప్రసాద్ ఎన్నికయ్యారు.





**కొత్తూరు, డిసెంబర్14(వార్త):** కొత్తూరు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా గోగుల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడిగా లోతుగడ్డ ఆనందరావు ఎన్నికయ్యారు. కొత్తూరు హైస్కూల్‌లో ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కర్లెమ్మ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా బోర శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా పడాల వెంకటకృష్ణను ఎన్నుకున్నారు.

**సంతబొమ్మాళి, డిసెంబర్ 14(వార్త):** సంతబొమ్మాళి మండలంలోని తొమ్మిది మేజర్ సాగునీటి సంఘాలకు, ఒక మైనర్ సాగునీటి సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. మేఘవరానికి బుడ్డెపు ఢిల్లేశ్వరరావు, ఉదయపురానికి పట్నాన అప్పలరాజు, ఆర్.హెచ్.పురానికి పోలాకి కృష్ణమూర్తి, ఉమ్మిలాడుకు మూగు రామారావు, గోవిందపురానికి రెడ్డి అప్పన్న, సంతబొమ్మాళికి అల్లు రమేష్ కుమార్, దండుగోపాలపురానికి లమ్మత చక్రవర్తి, తాళ్లవలసకు పంగ తవిటయ్య, మర్రిపాడుకు అట్టాడ జగన్నాథం, కాకరాపల్లికి అధ్యక్షులుగా పల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోతునాయుడుపేట ఎన్నిక వాయిదా పడింది.



Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546